సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2024



సోమశిలలో 17.418 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 17.418 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,240
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,769
3 శాతం జీఎస్టీతో..	రూ.5,942
సవర (8 గ్రా)	రూ.47,536

గరిష్టం/కనిష్టం
33.4 /25.1

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయి. బుధవారం మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నేడు రైతుల ఖాతాల్లో నగదు జమ

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ నగదును బుధవారం రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,20,749 మంది రైతు కుటుంబాలకు రూ.45.28 కోట్ల నగదును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలను కూడా అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. 2021–22 రబీ సీజనుకు సంబంధించి 14,483 మంది రైతులకు రూ.3.7 కోట్లు, 2022 ఖరీఫ్‌కు సంబంధించి 3,148 మంది రైతులకు రూ.81.66 లక్షల నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు.

ప్రశాంతంగా టెట్



గీతాంజలి కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రామారావు

నెల్లూరు (టౌన్): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షను జిల్లా వ్యాప్తంగా 3 సెంటర్లలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 మందికి 385 మంది హాజరుకాగా 86 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో, ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో, నెల్లూరు ముత్తుకూరు రోడ్డులోని గీతాంజలి పీజీ కళాశాలలో పరీక్షలు జరిగాయి. జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ముత్తుకూరు రోడ్డులోని గీతాంజలి పీజీ కళాశాలలో పరీక్షలను పరిశీలించారు.

ఏప్రిల్ నుంచి కందిపప్పు పంపిణీ

- డీఎస్‌ఓ వెంకటరమణ



నెల్లూరు(పొగతోట): బియ్యం కార్డుదారులకు ఏప్రిల్ నుంచి కందిపప్పు పంపిణీ చేస్తామని డీఎస్‌ఓ వెంకటరమణ చెప్పారు. మంగళవారం జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో చౌకదుకాణాల డీలర్లతో డీఎస్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం కార్డుదారులకు వచ్చే నెల నుంచి క్రమం తప్పకుండా కందిపప్పు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దానికి అవసరమైన కందిపప్పు గోదాములకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టామని, పంపిణీ ప్రక్రియను వలంటీర్లు పర్యవేక్షించవలసి ఉందన్నారు. ఇందుకు వలంటీర్లకు ఒక్కొక్కరికి ప్రతి నెల రూ.500 వారి బ్యాంకు అకౌంట్లకు జమ చేస్తారన్నారు.

కండలేరులో 10.259 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 10.259 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 480 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 260 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

గూడూరురూరల్: మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 16వ తేదీకి వాయిదా వేసినట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

రూ.18.6 కోట్లతో దేవాలయాల నిర్మాణం

- దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్

నాయుడుపేటటౌన్: శ్రీవారి ట్రస్ట్ ద్వారా రూ.18.6 కోట్లతో 186 ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపునకు ఆయన ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఆలయాల నిర్మాణం చేపట్టేందుకు ఎవరైనా 20 శాతం నిధులు పెట్టుకుని ముందుకు వస్తే దేవదాయశాఖ నుంచి 80 శాతం నిధులు మంజూరు చేస్తామన్నారు.

మంచం పట్టిన వ్యవస్థకు జవసత్వాలు

సంచార సంజీవని ఊరికి కొత్త ఊపిరి అందిస్తోంది. గ్రామాలలో మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులతో పాటు అనారోగ్య బాధితులకు 104 వాహనాల సంచార వైద్య సేవలు వరంలా మారాయి. ఎటూ వెళ్లాల్సిన అవసరం లేకుండానే సొంతూరులోనే మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందుతున్నాయి. బీపీ, షుగరు లాంటి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారికి, గర్భిణులకు 104 సేవలు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి.

పేదలకు మెరుగ్గా 104 సేవలు

- ఊళ్లకే వెళ్లి వైద్యంతో కొత్త ఊపిరి
- 20 నుంచి 51కి చేరిన వాహనాలు
- ఎప్పటికప్పుడు పెరుగుతున్న ఓపీల సంఖ్య
- సంతోషం వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజలు



జిల్లాకు కేటాయించిన 104 వాహనాలు (ఫైల్)

ఇది కదా.. అభివృద్ధి

దుత్తలూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య సేవలను పల్లెముంగిటకే తీసుకువచ్చింది. 104 వాహనాలు ప్రతినెలా రెండుసార్లు ఠంచన్‌గా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ ప్రజలకు వైద్యం అందిస్తున్నాయి. గత టీడీపీ హయాంలో మంచం పట్టిన ఈ వ్యవస్థకు నేడు జవసత్వాలు కల్పించి ప్రతి మండలానికి 104 వాహనం అందుబాటులో ఉండేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నిర్వహణ బాధ్యులతో ఈ వాహనాలు నడుస్తున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 46 మండలాలకు గత టీడీపీ హయాంలో కేవలం 20 వాహనాలే వైద్యం అందించేవి. దీంతో గ్రామాలలో పూర్తిస్థాయిలో విజిట్స్ జరిగేవీలుండేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పీహెచ్‌సీల పరిధిలో నెలలో రెండుసార్లు సంచార వాహనాలు విజిట్ చేస్తూ ఉదయం గ్రామాలలో వైద్యసేవలందిస్తున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానిస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగానే జిల్లాకు కొత్తగా 32 వాహనాలు కేటాయించారు. ఇవి రాకముందు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో నెలకు ఒక్కరోజు మాత్రమే విజిట్స్ జరిగేవి. కొత్త వాహనాల రాకతో ఇప్పుడు నెలకు రెండ్రోజులపాటు గ్రామాలలో ఉచిత వైద్యసేవలందుతున్నాయి. వివిధ రోగాలతో, ప్రమాదాలతో ఇళ్లకే పరిమితమైన రోగులకు పీహెచ్‌సీ వైద్యులు నేరుగా ఇంటికి వెళ్లి వైద్యం అందించేలా ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం డిజైన్ చేశారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

104 వైద్యసేవలు ఇలా..

పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలలో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు 104 వాహనం అందుబాటులో ఉంటుంది. 104 వైద్యునితో పాటు సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు, ఏఎన్‌యం, ఆశా కార్యకర్త అక్కడే అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల సచివాలయాల వద్ద రోగులకు వైద్యసేవలందిస్తారు. అనంతరం నడవలేని వారు, మంచాన పడిన వృద్ధులు, దివ్యాంగులు, ఇతర రోగులకు ఇళ్లవద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు. 104లో ఉండే డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రతి రోగి వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులో పొందుపరుస్తాడు. ఈ వివరాలను టెలీ మెడిసిన్ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు అనుసంధానించి భవిష్యత్తులో తక్షణమే మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. రోగికి మెరుగైన వైద్యసేవలు అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆసుపత్రులు, ఆరోగ్య నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. సంబంధిత రోగిని ఆసుపత్రులకు తరలించే బాధ్యతలు కూడా స్థానిక ఏఎన్‌యంలు నిర్వహిస్తున్నారు.

నాలుగేళ్ల నుంచి సేవల వివరాలు

సంవత్సరం	ఓపీ కేసులు	బీపీ	షుగరు	ఇతర పరీక్షలు
2020-21	2,52,669	62,837	59,607	70,865
2021-22	6,24,420	1,36,474	1,51,135	2,54,374
2022-23	7,08,934	1,18,386	1,33,623	2,09,135
2023-24	11,62,707	3,27,214	3,24,354	5,36,483

గ్రామాలలో ఇబ్బందులు లేకుండా సేవలు



మాలాంటి వృద్ధులు వైద్యశాలలకు వెళ్లకుండా మా గ్రామంలోనే పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇస్తున్నారు. అంతేకాక షుగరు, బీపీ లాంటి రక్తపరీక్షలు చేస్తున్నారు. మళ్లీ వచ్చిన తర్వాత సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై విచారిస్తున్నారు.

దొడ్డంరెడ్డి రమణమ్మ, మందాలనాయుడుపల్లి

అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు



ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వైద్యసేవలు బాగున్నాయి. జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక వైద్యశాలల్లో కూడా అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. పెద్ద పెద్ద ఆసుపత్రులకు వెళ్లకుండా స్థానికంగానే వైద్యసేవలందడం సంతోషకరం.

మద్దిరెడ్డి వెంగమ్మ

వైద్యసేవలు పెరిగాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 32 వాహనాలు కేటాయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 52 వాహనాల ద్వారా వైద్యసేవలు అందించగలుగుతున్నాం. ఎక్కడా రాజీపడకుండా ఉచిత వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీ చేస్తున్నాం. గతేడాది కంటే ఓపీ గణనీయంగా పెరిగింది. వైద్యపరీక్షలు చేయించుకునే వారు కూడా పెరిగారు. 104 సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

వెంకట్‌రెడ్డి, 104 విభాగం, జిల్లా మేనేజరు

కందుకూరు టీడీపీలో అయోమయం

తొలి జాబితాలో ఐఎన్‌ఆర్‌కు దక్కని చోటు

- ఆయనకు టికెట్ దక్కనీయకుండా ప్రత్యర్థి వర్గం వ్యూహాలు
- ఆంతరంగికులతో సమావేశం పెట్టుకున్న కోటపాటి
- బల నిరూపణకు దిగిన ఇంటూరి రాజేష్



సాక్షిప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలోను కందుకూరు నియోజకవర్గ టీడీపీ టికెట్ ఎవరికన్న దానిపై అనిశ్చితి నెలకొంది. టికెట్ రేసులో నాయకుల మధ్య విభేదాలు ఎంతకూ తెగడం లేదు. టికెట్ నాదే అని పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు చెప్పుకుంటుంటే, ఆయన ప్రత్యర్థి వర్గం ఆయనకు టికెట్ దక్కకుండా ఎత్తులు వేస్తోంది. ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు విడుదల చేసిన తొలి జాబితాలో నాగేశ్వరరావు పేరు లేకపోవడం, అదే సందర్భంలో ఆయన ప్రత్యర్థి వర్గం సరికొత్త రాజకీయ వ్యూహాలకు పదునుపెడుతుండడంతో నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అయోమయ వాతావరణం నెలకొంది.

నిరాశలో ఐఎన్‌ఆర్ శిబిరం

ప్రధానంగా టీడీపీ టికెట్ కోసం ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన ప్రత్యర్థి వర్గ నాయకులైన ఇంటూరి రాజేష్, కోటపాటి జనార్దన్, మహిళా నాయకురాలు ఉన్నం నళినీదేవిల మధ్య పోరు తారాస్థాయికి చేరుతోంది. నాగేశ్వరరావుకి టికెట్ దక్కకుండా చేయడంతో పాటు, తమలో ఎవరికో ఒకరికి టికెట్ కేటాయించేలా అధిష్టానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే ఇటీవల నాలుగైదు రోజుల నుంచి పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈనెల 24న పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు 94 మంది పేర్లతో తొలి జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలో పేరు లేకపోవడంతో నాగేశ్వరరావు వర్గం పూర్తిగా డీలా పడిపోయింది. రెండు సంవత్సరాలుగా పార్టీ బాధ్యతలను ఆయన చూస్తున్నారు. అధిష్టానం చెప్పిన కార్యక్రమాలను అమలు చేసుకుంటూ టికెట్ తనకే వస్తుందని ఆయన చెప్పుకుంటూ వస్తున్నారు. అయితే తొలి జాబితా విడుదల తరువాత అసలు పార్టీలో ఏం జరుగుతుందోనని, తన పేరు ఎందుకు జాబితాలో లేదంటూ అయోమయంలో పడ్డారు. జాబితాలో తన పేరు లేకపోవడానికి కారణం ఏమిటి, పార్టీలో అంతర్గతంగా ఏం జరిగింది, ఎవరు అడ్డుకున్నారనే విశ్లేషణలతో ప్రస్తుతం నాగేశ్వరరావు శిబిరం నాయకులు లెక్కలు వేసుకునే పనిలో పడ్డారు.

బల ప్రదర్శనకు దిగుతున్న ప్రత్యర్థి వర్గం

తొలి జాబితాలో ఇంటూరి నాగేశ్వరరావు పేరు లేకపోవడంతో ఆయన ప్రత్యర్థి వర్గం నాయకులకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఇదే అదునుగా తమ రాజకీయ వ్యూహాలకు పదునుపెడుతున్నారు. నాగేశ్వరరావుకు టికెట్ దక్కకుండా అడ్డుకోవడం ఒక ఎత్తైతే, తమలో ఎవరికో ఒకరికి టికెట్ దక్కించుకునే వ్యూహం మరొకటి. దీనిలో భాగంగా గత రెండు రోజులుగా బల ప్రదర్శనకు దిగుతున్నారు. ప్రధానంగా ఇంటూరి రాజేష్ మంగళవారం తన వర్గం నాయకులతో కలిసి కందుకూరు నుంచి ర్యాలీగా నెల్లూరు వెళ్లి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. ఇది కచ్చితంగా బల ప్రదర్శనకు దిగడమేనని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం మరో నేత కోటపాటి జనార్దన్ పామూరు రోడ్డులోని కళ్యాణ మండపంలో తన వర్గంతో సమావేశమయ్యారు. ఈయన టిక్కెట్ దక్కించుకునేందుకు ఎంత ఖర్చు చేసేందుకైనా వెనుకాడేది లేదని, పార్టీ అధిష్టానం వద్ద రూ.50 కోట్ల వరకు డిపాజిట్ చేసేందుకు కూడా సిద్ధమేనని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో టికెట్ తనకే వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇక ఇటీవల బీజేపీ నుంచి టీడీపీలో చేరిన మహిళా నాయకురాలు కూడా టికెట్ నాదేనని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఓ మీడియా అధినేతతో పాటు, ప్రస్తుత, మాజీ బీజేపీ పెద్దలపై ఈమె ఆశలు పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అసలు పార్టీలో ఏం జరుగుతుందో అర్థంకాని అయోమయ పరిస్థితుల్లో కేడర్ ఉంది.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

- మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు
- హాజరుకానున్న 52,076 మంది విద్యార్థులు
- జంబ్లింగ్ విధానంలో పరీక్షలు
- ఫిర్యాదుల కోసం కంట్రోలు రూం ఏర్పాటు
- పబ్లిక్ డొమైన్‌లో హాల్ టిక్కెట్లు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు జిల్లా ఇంటర్‌బోర్డు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇంటర్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 81 సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిల్లో ప్రభుత్వ 27, ప్రైవేటు 54 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలను 27 జోన్లుగా విభజించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షల్లో విద్యార్థుల ఇబ్బందుల పరిష్కారం కోసం ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోలు రూంను ఏర్పాటు చేశారు. సమస్యలపై 0861– 2320312 నంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. నేరుగా విద్యార్థులే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెబుతున్నారు.

హాజరుకానున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 52,076 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్ 25,202, ఒకేషనల్ 1217 మంది కలిపి 26,419 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ 24,243, ఒకేషనల్ 1414 మంది కలిపి మొత్తం 25,657 మంది ఉన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. వీటిల్లో చేజర్ల, కుల్లూరు, రాపూరు, మర్రిపాడు, ఆత్మకూరు, బిట్రగుంట, ఉదయగిరి ప్రాంతాల్లోని కేంద్రాలు ఉన్నాయి.

పకడ్బందీగా నిర్వహణ

ఇంటర్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. 81 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 81 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. 1200 మందికి పైగా ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. వీరితో పాటు మరో 16 మంది కస్టోడియన్లను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరుగు ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లకు పంపించారు. పరీక్షలు జరిగే సమీప ప్రాంతాల్లో జిరాక్స్, ఆన్‌లైన్ దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని అధికారులు కల్పించారు. పరీక్షలు జరుగు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు కంట్రోలు రూంను ఏర్పాటు చేశాం. హాల్ టికెట్లను నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా కంట్రోలు రూంకు ఫోన్ చేసినట్లయితే వెంటనే పరిష్కరిస్తాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

ఎ.శ్రీనివాసులు, ఆర్ఐఓ

ఎస్‌హెచ్‌జీల ఆర్థిక పరిపుష్టికి ప్రణాళిక

- 13 మోడల్ మండలాల ఎంపిక
- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, దానికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఏపీఎంలను ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 37 మండలాల్లో 13 మండలాలను మోడల్ మండలాలుగా మొదటి విడతలో ఎంపిక చేశామన్నారు. ఈ మండలాల్లోని ఎస్‌హెచ్‌జీలు అన్ని కార్యక్రమాల్లో పాల్గొని అభివృద్ధి చెందేలా వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పొదుపు గ్రూపులు ఏ గ్రేడ్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి సంబంధించి ప్రతి గ్రూపులో చదువుకున్న వారిని బుక్‌కీపర్‌గా నియమించడం జరుగుతుందని, ప్రతి గ్రూపు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడం, రుణాలను తిరిగి చెల్లించడం, పొదుపు చేసుకోవడం తదితర కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన 13 మండలాల్లో ఆయా ప్రాంతాలకు అవసరమైన వ్యాపారాలను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీల చేత వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసి అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరు నెలల్లో మండల సమాఖ్యలను పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్త్రీనిధి ఏజీఎం కామక్షయ్య, ఐడీ డీపీఎం కామాక్షి, ఏపీఎం సుజన, వివిధ మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

పారిశ్రామిక దరఖాస్తులకు గడువులోగా పరిష్కారం

నెల్లూరు(దర్గామిట్ట): పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా జిల్లా పారిశ్రామిక, ఎగుమతి, ప్రామోషన్ కమిటీకి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి, ప్రమోషన్ కమిటీ సమావేశం వెబ్ఎక్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రియాశీలకంగా అమలులో ఉన్న 9 భారీ ప్రాజెక్టుల అభివృద్ధి గురించి చర్చించారు. 2023–24 సంవత్సరంలో సింగిల్ డెస్క్ పోర్టల్ కింద పెండింగ్‌లో ఉన్న 1559 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. చిన్న సూక్ష్మ తరహా యూనిట్ల సర్వేను వార్డు, సచివాలయాల సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సర్వే నిర్వహించనున్నారని తెలిపారు. శుక్రవారం నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. పీఎంఈజీపీ కింద మార్జిన్ మనీతో రూ.12.28 కోట్లతో 201 యూనిట్లు ప్రారంభమయ్యాయని తెలిపారు.

పనులకు ఫొటోలే సాక్ష్యం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఇది పల్లెల్లో ఎంతో ఉపయోగ పడే కార్యక్రమం. కానీ కొందరి వల్ల అక్రమాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఉపాధి పనుల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా జిల్లా అధికారులు సరికొత్త ఆలోచన చేశారు. ప్రతి పనికి ముందు.. పూర్తయిన తర్వాత ఫొటోలు తీయించి ఆల్బమ్ చేయించాలని నిర్ణయించారు. దీని వల్ల పారదర్శకత ఉంటుందని భావిస్తున్నారు.

- ఉపాధి పనులపై ఆల్బమ్
- అధికారుల ఆలోచన
- జిల్లాలో వినూత్న కార్యక్రమం

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని 37 మండలాల్లో 4 లక్షల మందికిపైగా ఉపాధి జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. పంచాయతీ అనుమతి పొందిన పనులను జాబ్‌కార్డులు కలిగిన కూలీల చేత చేయిస్తున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం ప్రస్తుతం రోజుకు 60 వేల నుంచి 70 వేల మందికి పనులు కల్పిస్తున్నారు. వారికి రోజుకు రూ.272 తగ్గకుండా వేతనం మంజూరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. కూలీలకు పనులు కల్పించి వాటికి కొలతలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి వారికి వేతనాలు మంజూరు చేయించి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడానికి ప్రతి మండలంలో సిబ్బంది ఉన్నారు. ఎఫ్‌ఏలు, టీఏలు, బీఎఫ్‌టీలు, ఈసీలు, ఏపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు, క్లస్టర్ ఏపీడీలు అందుబాటులో ఉన్నారు.

పనుల కల్పన

ఉపాధి పనుల్లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. సమావేశాలు పెట్టి



సీతారామపురం మండలంలో పనికి ముందు, జరుగుతుండగా, పూర్తయ్యాక తీసిన ఫొటో

దానికి అనుగుణంగా పనులు గుర్తిస్తుంటారు.. పంట పొలాలకు రోడ్లు వేయడం, కాలువలు, చెరువులు, కుంటల్లో పూడికతీత, తవ్వకాలు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం రూ.వందల కోట్ల పనులు జరుగుతుంటాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అయితే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వివిధ శాఖల భవన నిర్మాణాలు చేపట్టారు. దీంతో కూలీలకు విరివిగా పనులు లభించాయి. పల్లెల రూపురేఖలు మారాయి.

ఎందుకంటే..

జరిగిన పనులపై సంవత్సరానికి ఒక పర్యాయం సామాజిక తనిఖీలు (సోషల్ ఆడిట్) నిర్వహిస్తారు. ప్రత్యేకంగా నియమించబడిన సిబ్బంది ఆయా పంచాయతీల్లో జరిగిన పనులను గుర్తించి.. వాటి కొలతలు తీస్తారు. అసలు జరిగాయా? లేదా? అనే వివరాలు సేకరిస్తారు. పనులు పూర్తి కావడానికి ఎంత ఖర్చు చేశారు?, కూలీలకు వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమైందా? లేదా? తదితర పూర్తి వివరాలు నమోదు చేస్తారు. పనులు జరగకపోతే ఉపాధి సిబ్బందికి రికవరీలు విధిస్తారు. మరోలా కూడా రికవరీలు పడుతున్నాయి. అధిక శాతం మట్టి పనులు ఉంటాయి. అవి జరిగిన సంవత్సరం తర్వాత సామాజిక తనిఖీ సిబ్బంది వచ్చి కొలతలు తీస్తుండటంతో ఒక్కోసారి తేడాలు ఉంటున్నాయి. దీనికి వర్షాలు, ఇతర కారణాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల ఒక్కోసారి రికవరీలు పడుతున్నట్లు గుర్తించారు.

పక్కాగా జరిగేందుకే..



ఉపాధి హామీ పనులకు సంబంధించి నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. పనులు చేయకముందు.. చేసిన తర్వాత ఫొటోలు తీసి అల్బమ్ సిద్ధం చేయిస్తున్నాం. ప్రతి మండలంలో చేసిన పనులకు ఫొటోలే సాక్ష్యాలుగా ఉంటాయి. పక్కాగా జరిగేందుకే ఇలా చేస్తున్నాం. రాష్ట్రంలో మొదటిసారి ఈ కార్యక్రమం ప్రారంభించాం.

– వెంకట్రావ్, డ్వామా పీడీ

పరిష్కారం ఇలా..

ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు డ్వామా పీడీ వెంకట్రావ్ చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి మండలంలో ఆల్బమ్‌లు సిద్ధం చేయిస్తున్నారు. పంచాయతీల వారీగా పని ప్రారంభానికి ముందు ఫొటో తీయిస్తున్నారు. పూర్తి చేశాక కూడా తీసి ఆల్బమ్ రూపొందిస్తున్నారు. సామాజిక తనిఖీల సమయంలో వీటిని ఆధారంగా చూపించనున్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా జిల్లాలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఎప్పటికైనా చేసిన పనులకు ఫొటోలు సాక్ష్యంగా ఉంటాయని అధికారులు వినూత్న ప్రక్రియకు తలపెట్టారు. చేసిన పనులకు సంబంధించి ఎంబుక్‌లు, ఫొటోలు అందుబాటులో ఉంటాయి.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇంటికెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా..

- కారు ఢీకొని విద్యార్థిని మృతి

సంగం: ఆ బాలిక బడిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా నేర్చుకుంది. తోటి పిల్లలతో ఆడిపాడింది. ఆఖరి గంట కొట్టాక సంతోషంగా ఇంటికి బయలుదేరింది. ఈ సమయంలో కారు ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. ఈ ఘటన మండలంలోని వెంగారెడ్డిపాళెం సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంగారెడ్డిపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శిరీష దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వారిలో పెద్ద కుమార్తె అయిన గుండాల వెంకట సంధ్య (10) స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. మంగళవారం సాయంత్రం పాఠశాల వదిలాక సంధ్య ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో నెల్లూరు నుంచి సంగం వైపునకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలిక తీవ్రంగా గాయపడింది. స్థానికులు గుర్తించి వెంటనే బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. అప్పటి వరకు పాఠశాలలో చలాకీగా నవ్వుతూ తిరిగిన విద్యార్థిని మృతితో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఆస్పత్రిలో వెంకట సంధ్య మృతదేహం


వెంకట సంధ్య (ఫైల్)

అపోలో ఆస్పత్రిలో కనెక్టెడ్ కేర్ సేవలు

నెల్లూరు సిటీ: నగరంలోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్లో కనెక్టెడ్ కేర్ సేవలను ప్రారంభించినట్లు హాస్పిటల్స్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వార్డు వెలుపల నుంచి కూడా రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, వైద్యం అందించేందుకు ఈ సేవలను యాజమాన్యం ప్రారంభించిందన్నారు. గతంలో వార్డులో ఉండే రోగిని 24 గంటలపాటు వైద్య సిబ్బంది పర్యవేక్షించేవారన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వైద్యులను అప్రమత్తం చేసేవారని తెలిపారు. అయితే ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేదన్నారు. తాజాగా ప్రవేశపెట్టిన కనెక్టెడ్ కేర్ సేవల్లో భాగంగా రోగికి అనుసంధానం చేసిన ఏఐ టెక్నాలజీ వైద్యులను ఎప్పటిప్పుడు అప్రమత్తం చేస్తుందన్నారు. దీంతో ఆరోగ్య పరిస్థితి క్షీణించడానికి ముందే డాక్టర్లు రోగి వద్దకు చేరుకుని వైద్య సేవలను ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఈ సేవలను ఇప్పటికే 20 అపోలో యూనిట్లలో 1,250 పడకలకు అనుసంధానం చేశారన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితులు రియల్ టైంలో తెలియజేయడమే కాకుండా, మార్పులను ఈ టెక్నాలజీ ముందుగానే గుర్తించి వైద్యులకు చేరవేస్తూ మంచి ఫలితాలను ఇస్తుండటంతో నెల్లూరులోనూ మొదలు పెట్టామన్నారు. ఇంకా చీఫ్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ ఏకే చక్రవర్తి, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ భక్తవత్సలరెడ్డి మాట్లాడారు. సమావేశంలో హాస్పిటల్ నెల్లూరు యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్

రక్త నమూనాల సేకరణ

పొదలకూరు: మండలంలోని చాటగొట్ల గ్రామంలో బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్లు మృతిచెందడంతో ఈనెల 19న వ్యాధి నిర్ధారణ కోసం కేంద్ర వైద్యారోగ్య శాఖ బృందం గ్రామానికి విచ్చేసి గ్రామస్తుల రక్త నమూనాలను సేకరించిన విషయం తెలిసిందే. తిరిగి పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం విచ్చేసి ఆస్పత్రిలో కొందరి రక్త నమూనాలను సేకరించారు. ఈ బృందంలో నేషనల్ సెంటర్ ఫర్ డీసీజెస్ కంట్రోల్ నుంచి డాక్టర్ సుస్మితా సింగాల్, లేడీ హార్డింగ్ హాస్పిటల్ డాక్టర్ గుర్మీత్ కౌర్, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసన్ డాక్టర్ శ్రేయ శర్మ ఉన్నారు. ఈ సందర్భంగా వారు సీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ద్వారా వివరాలు సేకరించారు. ల్యాబ్‌ను పరిశీలించి రక్త పరీక్షలు జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. లక్షణాలు కలిగిన వారు ఆస్పత్రికి వస్తే వెంటనే సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. వారి వెంట జిల్లా సర్వైలెన్స్ వైద్యాధికారి భాస్కర్, సీహెచ్‌సీ వైద్యాధికారులు శివకృష్ణ, మల్లికార్జున్, స్రవంతి, పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు ఉన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్ నలుగురు తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ, ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.మెహర్‌కుమార్‌ను నెల్లూరు కలెక్టరేట్ (ఎల్‌ఏ) గెజిట్ సూపరింటెండెంట్‌గా, పి.కృష్ణకాంత్‌ను కందుకూరు తహసీల్దార్‌గా, పి.పద్మనాభుడిని నెల్లూరు ఎల్‌ఏ స్పెషల్ తహసీల్దార్‌గా, జి.శ్రీధర్‌బాబును, నెల్లూరు కేపీటీపీఎస్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు. కాగా చేజర్ల డిప్యూటీ తహసీల్దార్ పి.విజయ్‌ను ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి, అక్కడి డీటీ వై.అశోక్‌కుమార్‌ను చేజర్లకు, నెల్లూరు రూరల్ మండల డీటీ సీహెచ్ గోపీకృష్ణను దగదర్తికి, ఇక్కడి డీటీ జి.మధును నెల్లూరు రూరల్‌కు, కోవూరు ఆర్ఎస్‌డీటీ విధులు నిర్వహిస్తున్న వై.గీతాదేవిని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ కార్యాలయ స్పెషల్ డీటీగా బదిలీ చేశారు.

2న చంద్రబాబు రాక

నెల్లూరు సిటీ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మార్చి 2వ తేదీన నెల్లూరుకు రానున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో మంగళవారం టీడీపీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతారన్నారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ చిట్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సురెన్స్‌కు సంబంధించి నెల్లూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు బ్రాంచ్‌ల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. ఏజెంట్స్ రిక్రూట్‌మెంట్, ఏజెంట్స్ యాక్టివేషన్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలు నెల్లూరు ఆటోనగర్ లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరుగుతాయన్నారు. ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వయసు 32 సంవత్సరాల్లోపు ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూకు రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన మనోహర్ పని నిమిత్తం ముత్తుకూరు మండలం పంటపాళేనికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో సర్వేపల్లి సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో మనోహర్‌కు గాయపడగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.22



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 156
లేయర్ (లైవ్)	: 72
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 122



వీబీఆర్ సేవలు అభినందనీయం

నెల్లూరు రూరల్: వీబీఆర్ ఎడ్యుకేషన్ సంస్థల వ్యవస్థాపకుడు ఊటుకూరు బ్రహ్మారెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు అభినందనీయమని కేంద్ర ప్రభుత్వ అధికారి పరవస్తు నాగసాయి సూరి అన్నారు. రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఉన్న వీబీఆర్ రెసిడెన్షియల్ స్కూల్లో మంగళవారం వీబీఆర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగసాయి మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన బ్రహ్మారెడ్డి విద్యాపరంగా ఎంతో పురోగతి సాధించారని కొనియాడారు. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సాహించారని తెలిపారు. పలువురు వీబీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వి.సత్యనారాయణరెడ్డి, రచయిత నాగరాజశర్మ, స్కూల్ డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీబీఆర్ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వీబీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అతిథులు

డిగ్రీ పరీక్షలకు 566 మంది గైర్హాజరు

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 566 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 7,797 మందికి గానూ 7,231 మంది హాజరయ్యారని తెలియజేశారు.

నిమ్మ తోటల పెంపకంపై అవగాహన

- జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి

పొదలకూరు: పట్టణంలో నిమ్మ మార్కెట్ యార్డు ఉందని, అందువల్ల తోటల పెంపకం, కాయల కోత తదితర అంశాలపై వ్యాపారులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి సూచించారు. పొదలకూరు బిట్–3 ఆర్బీకేలో మంగళవారం వీహెచ్‌ఏలు, వీఏఏలకు నిమ్మ తోటల సాగు, సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ మాట్లాడుతూ పొదలకూరు మండలంలో నిమ్మ తోటల సాగు అధికంగా ఉందన్నారు. తోటల్లో పచ్చిరొట్ట ఎరువులైన పిల్లిపెసర, జనుములను చల్లి కోసి చెట్ల పాదుల్లోనే పడవేయాలన్నారు. నేల స్వభావాన్ని బట్టి రైతులు నిమ్మ తోటల సాగు చేసుకోవాలని క్షేత్రస్థాయిలో వివరించాల్సిందిగా పేర్కొన్నారు. అంతర్ పంటలుగా మినుము, పెసర సాగు చేసుకోవాలని రైతులకు వివరించాలన్నారు. నిమ్మసాగు, సస్యరక్షణపై పొదలకూరు ఉద్యానాధికారి ఈ.ఆనంద్ మాట్లాడారు. అనంతరం నిమ్మ, చీని సస్యరక్షణపై ఉద్యాన శాఖ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సదస్సులో ఏఓ యు.గీతాకుమారి, నిమ్మ మార్కెట్ సెక్రటరీ డి.నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ పెదమల్లు రమణారెడ్డి, ఏఏబీ మెంబర్ వెన్నపూస దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న డీహెచ్‌ఓ సుబ్బారెడ్డి

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు మంగళవారం దాడులు చేసి సుమారు రూ.10 లక్షలకు పైగా విలువైన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా డీఎస్‌ఓ ఎం.రాజారఘువీర్ కథనం మేరకు.. సూళ్లూరుపేట నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీలో రేషన్ బియ్యం బస్తాలు ఉండడాన్ని గుర్తించారు. లారీ డ్రైవర్ షాకీర్‌ను విచారించగా అవి ఎవరివో తనకు తెలియదని చెప్పాడు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు బియ్యం బస్తాలు తీసుకెళ్లాలని మాత్రమే చెప్పారని, నెల్లూరుకు వస్తే దిగుమతి చేయాల్సిన చోటు చెబుతామన్నారని అతను అధికారులకు వెల్లడించాడు. లారీలో 270 క్వింటాళ్ల రేషన్ బియ్యం (550) బస్తాలను గుర్తించారు. వాటి విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని లెక్కగట్టారు. డ్రైవర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టుకు తరలించారు. రేషన్ బియ్యాన్ని నాయుడుపేట సివిల్ సప్లైస్ గోదాముకు తరలించారు. తనిఖీల్లో డీటీ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నది కాజ్‌వే సమీపంలో రహదారిపై సోమవారం రాత్రి మోటార్‌బైక్‌ను ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వేలూరు సురేంద్ర (38) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేటలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో నివాసముంటున్న సురేంద్ర మేనకూరు సెజ్ పరిధిలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముంగించుకుని బైక్‌పై నాయుడపేటకు వస్తున్నాడు. అదే సమయంలో మేనకూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్ అతడి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సురేంద్రను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం సురేంద్ర మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా.. స్వగ్రామమైన కోట మండలం, అందలమాల గ్రామానికి తీసుకెళ్లారు. సురేంద్రకు భార్య గిరీషా, ఇద్దరు కవల పిల్లలున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై